**అడ్డంగా ఒక గీత... అదే హద్దు.... సొంతంగా రాళ్లుపాతుకుని గిరిగీసుకుని ....చట్రంగా కాపురం చేసి ...నాదీనీదీ అనుకున్న జాగాలో ఎవరినీ చొరపడనీయకు ...కంచెల్ని కాపలాపెట్టి ముసుగుతన్ని పడుకుంటే ..... వద్దు రాద్ధాంతం చెయ్యొద్దు... మౌనంగా ఉండు.... బుర్రలో ఆలోచనలకు.... ఏ గీతతో హద్దు నిర్ణయిస్తావ్! పోనీలే రెప్పల్ని కుదిపి .... కనుచూపుమేర చూసుకుంటూ బతకనియ్యి... గోడలన్నీ అందమైన డిజైన్లతో పేర్చేయ్ .... ఇళ్లమీద కాకుల్ని వాలనీయకు. .... ముక్కుమూసుకో....చెవులుమూసుకో..... కంటితో మాత్రం దృశ్యాల్ని ఒడుపుగా పట్టుకో ..ఇదుగో ఇక్కడ.... చూడు... కొట్టుకుని...కొట్టుకుని ..... కదలిక ఆగిపోయి ...అప్పటి దాకా అడుగుల్ని కొలుచుకుని ...తన నీడ కదలికలతో బతుకుపంచుకుని ...బతికిన శవం ..బతుకు ముక్కలైన శవం.....తాగి...తాగి...తెగతాగి ...హంస ఎగిరిపోయిన ఎండుకట్టె ... శవం జనాల వడివడి..నడకల పరుగుల.....చూపులకు అందకుండా జారిపోతూ.... తెల్లవారు జామున కురిసినవానకు బిర్రబిగుసుకున్న ...శవం...**

నిన్నసాయంత్రం.....రోడ్డుమీద చిందులేస్తూ ....రోడ్డు పక్క కొట్టువాళ్లతో....గొడవపడ్తూ.... కేకలు వేస్తూ.... గెంటుకుంటూ....గుద్దుకుంటూ.... మందు కొట్టి వీథినపడి...స్వైరవిహారం చేసి.... కొళ్లీకొట్టు వాడితో ....పూలకుర్రాడితో తగవుపడి...లాడ్జీ బాయ్‌తో.... తిట్టించుకుని...గెంటించుకుని అంతా తెలుసన్నట్లే .....ఏమీ తెలియనట్లే..వీథులన్నీ బలాదూర్ తిరిగి..యానాం..యానాం..వినోదం పంచి ...ఇపుడు బిర్రబిగుసుకుని..అమాయకంగా శవమై.....

ఊళ్లోవాళ్లకి ఒక సాయంత్రం పరిచయం....అవును పాపం..అతనే....నిన్న రోడ్డుమధ్య తూలుతూ.... పడుతూ...రూపాయల్ని వెదజల్లిన పిచ్చోడి రూపం....అధోలోక జగత్తులో ....కుష్టు ముష్టోడ్ని పిలచి.... కౌగిలించుకుని.... బతిమాలి.... గారాబం చేస్తున్నట్టు నటించి వాడిచేతిలో విస్మ యాల మధ్య ...కళ్ల మెరుపులమధ్య వందనోటు కుక్కి....చిద్విలాసంగానవ్వి ..అంతలోనే ఏడ్చి... ఏడ్చి.... కనిపించినవాళ్లకు దణ్ణాలు పెట్టి ...పోలీ సులతో ..వంగి..వంగి....

అలాగే సార్....గొడవలేద్సార్ ..పర్వాలేద్సార్. ...సరదాసార్....అబ్బే న్యూసెన్సు ఏమీలేదు సార్... నేను మంచోడ్నే సార్ ... అయినా మాట్లాడకూడ దా సార్....సరే... సరే... వస్తాను సార్ ...పాటలు పాడొచ్చాసార్...


పోలీసుకి కన్నుకొట్టి....నవ్వి...బతిమాలి.... గెడ్డం పట్టుకోబోయి ముఖంలో సీరియస్‌నెస్ చూసి భయపడి నమస్కారాలు చేసి... తనలో తాను నవ్వుకుంటూ....తడబడిన అడుగుల దృశ్యంలోంచి ...రోడ్డు నిలువునా పడి ...శవంలా...శవమే... ఎవరూ రారేం? ఎవరికీ అక్కర్లేదా?శవం ఎవరిదీ కాదా!

ఎండ చురుక్కుమంటూ ..రోడ్డు కాలిపోతూ ..పెనంలా ..శవానికేం కాదు.... చెట్టు నీడకింద కొచ్చినట్టు శవం వారగా నెమ్మదిగా పాకుతూ.... చీమలు... ముక్కు మీద వాలుతూ..ఈగలు..తల వైపు దగ్గరగా పేడ...ఎండిన పేడ.... దీపం వెలిగించే ప్రమిదలా.... ఏడుపులు లేవు... దైన్యమైన చూపులు లేవు.... గత కాలపు... స్మృతుల ....కథలు....లేవు.... పంపకాల గగ్గోలులు.... ఆత్మీయతానుబంధాల దుఃఖపుతెరలు..లేనే లేవు.... శవం ...శవంలా పడి....రంగులేదు...రుచిలేదు..వాసనలేదు.... లేదూ.....ఉంది.

"ఏమిటండీ? రోడ్డుమీద అలాగే

# భౌతికం

దాట్ల దేవదానం రాజు



వారం వారం కథాప్రభ

ఉంచేశారు? ఇక ఇక్కడ్నుంచి....
తియ్యరా....పొద్దుట్నుంచీ అలాగేనా?...
ఏం...దేశం... ఏం మనుషులూ..... ఛీఛీ.... "

"కదిల్చే పనిలేదు. తీసుకెళ్లే ప్రసక్తి లేదు"

"అది ...అక్కడ...అంతేనా"

"అంతే"

"ఏమొచ్చిందీ? "

"తేలాలి..సమస్య తేలాలి. అప్పుడు గానీ ... శవం కదిలేది లేదు...శవం ఎవరి వాటాదోతేలాలి.... అందాకా అంతే!"

"శవం చుట్టూ ఆనవాలు పెట్టుకోమనండి. ముందిక్కడ్నుంచి తీయమనండి ..ఆనక ఎవరిదో తేల్చుకుంటారు.... "

"అహహ ..అదేమీ కుదరదు...ఇదేమీ ఊరు సమస్య కాదు....రాష్ట్రాల మధ్య సమస్య.... తేల వలసిందే.... అప్పటిదాకా అది అక్కడే..టోపీలు పెట్టుకుని.....లాఠీలు పట్టుకుని ఉద్యోగం చేస్తున్నం దుకు మేం ఇక్కడే...ప్స్"

"ఏంటి గురూ ! బొత్తిగా అనాథోడులా ఉన్నా డు.. చిల్లర గలగలమనేలా లేదు...అరువు చాకిరీ... మనకెందుకొచ్చిన తద్దినం..... ఎస్సైగారు గమ్మున వస్తే బావుణ్ణు.. చెప్పేసి పోదాం.. ఇది మన హద్దు కాదు.."

"పోలీసుగారూ! ఇది మీదేనయ్యా బాబూ! ..ఈ శవం మీదే... కనపడటంలేదూ! స్పష్టంగా ఇది మీ చోటులోదే!"

"అబ్బేకాదయ్యా! అదిగో అక్కడ్నుండి మొద లెట్టుకుని ఇక్కడిదాకా....ఇవతలి వైపు మాది.... కాదే... బాగా ,చూసుకోండి"

" యారూం వరవిల్లై ఎంద్రాళ్ ..ఎప్పడిఎత్తాయ్ పెత్ర పిల్లయో...మడిందు విట్టానింగే! (ఎవరూ రాకపోతే ఎలా... ఏ కన్నతల్లి బిడ్డో ఇక్కడ చచ్చాడు)

భాష.... మనుషుల మధ్య సంబంధాలు సమస్య కాదు. సంప్రదాయాలు, ఆచారాలు సమ స్య కాదు..... దైనందిన వ్యాపార లావాదేవీలు సమస్యకాదు.....సరిహద్దు కివతల సమస్య..... ఈ శవం..ఎవరి నెత్తికెక్కాలో... రెండు రాష్ట్రాల సరి హద్దు సమస్య... ఇవతలి వైపు పాండిచ్చేరీ రాష్ట్రానికి చెందిన యానాం.......అవతల వైపు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన....నీలపల్లి....శవం...కొట్టుకుని పార్లిన చోటు కాదు, శవం పడిన హద్దు తేలాలి! కబురంపండి! కబురంపండి! గ్రామసేవకులొస్తే కుదరదు, ఆ వి.ఏ.ఓ కు, కోరంగ పోలీసుస్టేషనుకు కబురంపండి. శవం ఎక్కడైనా దొరికితే వాటాల పీకులాట. నిండైన జేబుకు శవమొక్కటి చాలురా...గిట్టుబాటు కానదిది కంచి గరుడ సేవ. వాళ్లని పిలవండి, వీళ్లని పిలవండి...తేల్చండి, హద్దులు తేల్చండి. పాండి చ్చేరితానులో ఒక ముక్క యానాం. ఎక్కడైనా వెలుగుకు స్విచ్ మాత్రం పాండిచేరిలో. రెండు ద్రావిడ భాషల సంగమం. తెలుగులో ఏడవాలి, తమిళంలో నవ్వాలి.


"ఎస్సైగారొస్తున్నారు, దారి వదలండయ్యా!" లాఠీ మాట్లాడుతూ, టోపీ వినయంగా వంగింది.

"ఏమబ్బా, రంగనాథం! నువ్వు చెప్పావు కదా, మరల నేనెందుకు? ఎందుకిక్కడ, పదండి! మీ మాటే నా మాట. సరే, ఇది మనది కాదు, పదండి. స్టేషన్‌కొచ్చేయండి. అవునూ ... ఎవరన్నా వచ్చారా, రాలేదా? పోనీయండి ..."

"ఓ క్షణం ఆగితే ఆ ఊరి వి.ఏ.ఓ కూడా వస్తారుకదా సార్! తేల్చుకునే పోదాం."

"సరిగ్గా ఓ అయిదు నిముషాలు చూద్దాం."

కాలం ఊపిరిలాగేసుకుంటూ నిముషాలు



## తల్లి మనసు



ఇంగ్లండ్‌లోని వైసెస్టర్ అనే ఊళ్లో ట్వైట్రీస్ అనే జూలోని గొరిల్లా ఎన్‌క్లోజర్‌లోకి ఓ ఆరేళ్ల కుర్రాడు దూకాడు. అందులోని మూడు గొరిల్లాలు ఆ పిల్లాడి వంక తీక్షణంగా చూసి దగ్గరికి చేరుకున్నాయి. అయితే ఆ ఎన్‌క్లోజర్‌లోని, పదిరోజులక్రితమే తల్లి అయిన ఓ ఆడ గొరిల్లా మాత్రం వాటికి అడ్డు వెళ్లి ఆ పిల్లాడిని అవేం చేయకుండా కాపాడింది. అంతకు దాదాపు ఆర్నెల్ల మునుపు జరిగిన ఇలాంటి సంఘటనలో ఓ పిల్లవాడిని ఈ ఆడ గొరిల్లా కరిచింది. మాతృత్వం తెలిశాక ఆ కుర్రాడ్ని రక్షించాలన్న తలంపు దీనికి కలగడం ప్రకృతి విచిత్రమే మరి!

-పృథ్వీరాజ్

... నిమిషాలు...వాసన తెలిసిన వి.ఏ.ఓ. ఇంటిదగ్గరుం డగానే పసిగట్టేశాడు ... ఈ శవం జోలికెళ్లడం బుద్ధితక్కువ, డబ్బు తక్కువ! అవతలి కబురు. వెళ్లక తప్పుతుందా?

"ఏమండీ! బఖీరురాసి మీ కోరింగ పోలీసు స్టేషనుకు కబురెట్టారా? మా సోదరులొస్తున్నారా?'

"నేనెందుకు రాస్తాను బఖీరు? ఇది మా స్థలం కాదు. కనపడటంలేదా, సార్! అదిగో అక్కడ్నుంచి మా హద్దు. సందేహం ఏమీ లేదు. ఇది మీ హద్దే! అంచేతే వాళ్లకు చెప్పలేదు."

"ఏమిటోయ్ రంగనాథం, ఆయనలా అంటా డూ? అయితే బుజువులు చూపించండి. ఎందుకొ చ్చిన దాగుడుమూతలండీ, మాకేమీ సంబంధం లేదు. మేం ఇందాకనే పోవల్సినవాళ్లం.... ఏదో ఆగాం. ఏం తిప్పలు పడతారో మీరే పడండి!"

"మీరలా అంటారనే ఎఫ్.ఎమ్.బి. స్కెచ్ పట్టుకొచ్చాను. ఇదిగో, సార్! చూడండి, ఇక్కడ ఈ చుక్కదగ్గర మనం ఉన్నాం. వంతెనకింద నుండి ఇలా వచ్చి కొంచెం వెనక్కి తిరిగి ఇక్కడ కలిసింది. శవం తల దగ్గర్నుంచి ... సగం శరీరానికి పైగా మీ హద్దులోనే ఉంది. అంటే ఈ శవం మీదే! సారీసార్! మీ సరిహద్దులోనిదే!"

"మీ ఫీల్డ్‌మెజర్‌మెంటు బుక్కుల్ని మేం నమ్మం. మీ వాళ్లంటే అన్నీ కిరికిరిలే! మేం నమ్మం గాక నమ్మం! ఇది మాది కాదు. అయినా నడిచే కాళ్లు మీ హద్దులోనే ఉన్నాయిగా. ఇప్పుడీ శవం లేస్తే ఎవరి హద్దులో ముందుగా అడుగేస్తాడూ ... మీ చోటులోనే కదా, అంచేత ఇది మీదే!"

ముందు బుజువులు ... ఇప్పుడు తర్కం ... తర్వాత బుకాయింపు ... వైరాగ్యం ... అవసరానికి ఏదైతే అదే ప్రమాణం.

"బొత్తిగా అలా మాట్లాడితే ఎలా సార్? కాస్త కనికరించండి. ఎవడిదో అనాథ శవం. మీ మందు తాగబట్టే కదా వాడు చచ్చిందీ?"

"ఏమంటున్నావ్? మా మందు అంటావేంటి? సవ్యంగా మాట్లాడండి. మీకు మాత్రం మందు లేదా? మందులేకపోవడం ఎన్నాళ్ల భాగోతం! అయి నా మాటలు అనవసరం, మీ బోడిబుజువులు మాకక్కర్లేదు. మేంపోతున్నాం. పదండి, రంగ నాథం, గోవిందూ! మనకెందుకొచ్చిన రొస్టు!"

రోడ్డంతా ఎండరంగు. ఎదవ ఎండ

నిలబడ నీయడంలేదు. ఎస్సై పక్కకు వస్తుంటే కిళ్లీ షాపు వాడ్కి భయం భయం! డ్రింకంటాడేమో! సోడాతో సరిపెట్టుకుంటే బావుణ్ణు. సరే, రానియ్యి, ఏదైనా తప్పదు. ఓ సోడా కొట్టవోయ్! అమ్మయ్య, తక్కువ లోనే వదిలింది. ఇంకోటి కొట్టు! గడగడా తాగి వెళ్లిపోతున్నాడు. శవం అలాగే నిశ్చలంగా.... ఎవరూ రాలేదు.

"మాకూ సంబంధం లేద్సార్! మేమూ పోతు న్నాం. ఎస్సైగారూ! మీ మొండి పట్టుదల మీదేలా ఉంది. వస్తాం, సార్!"

"మేమూ పోతున్నాం."

"మేమూ పోతున్నాం."

కారు హారను. కారులోంచి పెళపెళమని మను షులు కొత్త నోట్ల కట్టల్లా ... ఒంటిమీద తళతళలు ...బంగారపు చైనుల్లా. ముఖాలు మాత్రం వాడి పోయి నలిగిన దుస్తుల్లా దిగుతున్నారు. ఇద్దరు మగాళ్లు, ఇద్దరు ఆడవాళ్లు. ఆడవాళ్లు నోటిలో చీర కొంగు ... దుఃఖపు వర్షానికి సిద్ధంగా కదులుతూ కళ్లు ...

ఎస్సైగారు, పోలీసులు, వి.ఏ.ఓ - అంతా ఆగి పోతూ నిలబడి వృత్తినేర్పిన అవగాహన, అంచనా లు వేసుకుంటూ ఎస్సైగారి చెవి దగ్గరకు స్పీడుగా ... పోలీసు ... ఉష్ ... గిష్ .... ఉష్ ... అహహా.... ఇహిహి ... ఎస్సై గంభీరంగా తల పంకించి వెనక్కి తిరిగి ...

"సరేనయ్యా! వి.ఏ.ఓ. గారూ, ఈ శవం మాదే లే! నీ ఫీల్డ్‌బుక్‌ని ఎందుకు కాదనాలి? మేం చూసు కుంటాంలే! సరే, ఇక మీరెళ్లండి."

"అమ్మమ్మ, ఎంతమాట ఎస్సైగారూ! తమరి లాంటి అధికార్ల మాట నేను కాదంటానా? మీకు శ్రమ అక్కర్లేదు సార్! బఖీరు రాస్తాను, మా వాళ్లకు కబురంపుతాను, మీరెళ్లండి సార్!"

"అదేమిటోయ్ మళ్లా ప్లేటు ఫిరాయించావ్? బుక్కన్నావ్ ... స్కెచ్ అన్నావు ... ఋజువులు చూపించావ్! సరేనని ఒప్పుకుంటే మరల కిరికిరిలు ... ఏమనుకుంటున్నావయ్యా మమ్మల్ని? ఒరేయ్, రంగనాథం! శవం వివరాలు రాసుకో!"

"అదేంటి సార్! అంతట్లో మీకేమొచ్చింది?"

"మీకొచ్చిందే ...మాకూ వచ్చింది."

పెళ పెళ ... తళతళ ... మనుషులు శవం దగ్గరకు.... ఇంకా దగ్గరకు ... బిర్రబిగుసుకున్న శవం .... సంశయంగా చూపులు. చూపుల్లో విషాదం లేదు. అంతులేని ఆనందం ... సందేహంలేని మాటలు ... అబ్బే, మనోడు కాదు! అమ్మయ్య ... రాంబాబు అనుకున్నాం. రాంబాబేడీ? ఎక్కడికెళ్లాడో? ... కానే కాదు, వీడు రాంబాబు కాదు. ఎక్కడో చిన్నతేడా ... తొందరబాటు సమాచారం ...రాంగ్ ఇన్ఫర్మేషను. రాంబాబు యానాం రాలేదు. వయస్సు రాంబాబుదే. ఆకారం రాంబాబులాగే ...రాంబాబు కాదు! మరేడీ రాంబాబు? ఫోన్ చేసిన వాడు కంగారుపడ్డాడు. రాంబాబేమోనని పొరబాటు పడ్డాడు. రాంబాబు ఈ పాటికి అమలాపురం పోయుంటాడు. అమ్మయ్య ...ఇక వెళదాం, పదండి!

"ఏంటి సార్! అలా నిలబడిపోయారు? మీకేం అవుతాడు? హాస్పిటల్‌కి వచ్చేయండి. అక్కడ రొటీన్ ఫార్మాలిటీసు పూర్తి చేసుకుని, అక్కడ్నుంచే తీరుకుపోదురుగాని."

"సారీ! మావాడనుకున్నాం. అదృష్టవశాత్తు కాదు. కంగారుపడి వచ్చాం. మా వాడింత కాదు. వస్తాం, సార్!"

"అదేంటి సార్! సరిగ్గా చూడండి, సార్! నిన్న ట్నుంచి ఒకటే తాగుడు కదా! ముఖం ఉబ్బిన ట్లుంది, సరిగ్గా చూడండి."

"లేదులెండి, వస్తాం! పదండి, కారు దగ్గరకి!'

కథ మళ్లీ మొదలు. శవం ఎవడిదో? వల్లకాటి వెంకన్న... ఎండ పేలిపోతూ, మాడు పగులగొడ్తూ ...మాటల ధోరణి మారిపోతూ...జంజాటం మేమెం దుకు పడాలి? ఇందాకడ్నుంచి చెబుతూనే ఉన్నాం. అల్లెప్పుడో ఒకసారిలాగే జరిగితే మీ వాళ్లే పట్టుకె ళ్లారు. ఇది మరీ డేంజరస్ బోర్డరులా ఉందే! నడిరోడ్డు ...బాగోదు, తీసుకెళ్లండి. మేం వెళుతున్నాం ... మేం వెళుతున్నాం!"

"అదేంటి సార్! ఇంతకుముందు గొప్ప చమ త్కారాలు వెళ్లబోసారూ ... మీరే తీసుకెళ్లండి. మేం మా పోలీసుస్టేషనుకు కబురెట్టం! ఋజువులు చూపించాం. మేమూ వెళుతున్నాం. మాకూ ఉచి తానుచితాలు తెలుసు! మేమూ మనుషులమే ... మాకూ చీమూ నెత్తురూ ఉంది. కారొచ్చినప్పుడు శవం జిగేలుమందా? ఇప్పుడేమో కంపు కొడ్తుందా? మీరే చేసుకోండి ఏం చేసుకుంటారో?"

"సరే, అలాగే కానీయండి. మేమూ పోతు న్నాం."

"మేమూ పోతున్నాం."

ఆగండాగండి, వెళ్లకండి. తగవు పెంచకండి. తునితగవు చేసుకోండి. డబ్బులు, ఆస్తులు పరిష్కారాలే కాకుండా శవాలకీ తునితగవే! చోద్యం ... పిదపకాలం! శవాన్ని ముక్కలు ...

శవంవాసన మొదలయ్యింది. ఎండకు నల్లగా కమిలి కమిలి... అటూ ఇటూ పెద్దమనుషులు ... వాదాలు ... మరల హద్దుల గీతల కొలతలు ... సరిగ్గా తల భాగం యానాంవైపు, మిగిలిన మొండెం నీలపల్లివైపు ... అంటే, ఇరవైసెంటీమీటర్ల తల ఒక వైపు, నూటయాభైసెంటీమీటర్ల మిగిలిన భాగం మరో వైపు.

ఆఖరికి పరిష్కారం... అమ్మయ్య ... తేలిపోయింది ... పెద్దమనుషులూ! శతకోటి వందనాలు! తల ఆర్డరు వేస్తేనే కాళ్లు నడిచేది. లోకాన్ని, ఆశల్ని, కోరికల్ని, ముసుగుల్ని తలచేది, కలగనేది... చూసేదీ తలే! సర్వేంద్రియానాం శిరస్సు ప్రధానం! అంతే.... అంతే! ఇక మాట్లాడకండి! Ⓟ

